సాక్షి
విజయనగరం
శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



దర్జా కోల్పోయిన దర్జీలు
ఓ వైపు రెడీమేడ్ వస్త్రాలు, మరోవైపు ప్రభుత్వం నుంచి రూపాయి సాయం అందకపోవడంతో దర్జీల పరిస్థితి దుర్భరంగా మారింది.
- 8లో



బియ్యం అక్రమ రవాణాపై నిరంతర నిఘా
- 8లో
పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మధుసూదన్ అన్నారు.



రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్ఎం
- 8లో
విజయనగరం రైల్వేస్టేషన్‌ను ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ మేనేజర్ లలిత్ బోహ్రా గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

ఇఫ్టూ విలీన సభను విజయవంతం చేయండి

బొబ్బిలి: రాజమండ్రి పుష్కరాల రేవు వద్ద మార్చి 2వ తేదీన నిర్వహించే ఇఫ్టూ విలీన సభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎం.గోపాలం పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను బొబ్బిలిలో గురువారం ఆవిష్కరించారు. కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వి.రామమూర్తి, పిల్లా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

- విజయనగరంలో ఘటన.. చినరావుపల్లిలో విషాదం



రోదిస్తున్న తల్లి అమ్మాజమ్మ



అన్నెపు లోకేష్ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్ : ఆదుకుంటాడనుకున్న కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. విజయనగరం జిల్లాలో డిగ్రీ చదువుతున్న కుమారుడు మృతి చెందాడన్న వార్త విని శోకసంద్రంలో మునిగిపోయారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎచ్చెర్ల మండలం చిన్నరావుపల్లి గ్రామానికి చెందిన అన్నెపు గణేష్, అమ్మాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సంతోష్‌కుమార్ డిగ్రీ పూర్తయి ఉద్యోగ వేటలో ఉండగా, చిన్న కుమారుడు లోకేష్ విజయనగరంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫస్టియర్ చదువుతున్నాడు. ఒక వైపు డిగ్రీ చదువుతూనే మరోవైపు రక్షణ రంగంలో ఉద్యోగాల కోసం స్నేహితులతో కలిసి రూమ్ అద్దెకు తీసుకొని కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ నెల 26న మధ్యాహ్నం 12 గంటల సమయంలో లోకేష్ స్నేహితులు సంతోష్‌కు ఫోన్ చేసి తమ్ముడు ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పడంతో విషాదంలో మునిగిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు విజయనగరం బయలుదేరారు. అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో కుమారుడి మృతదేహాన్ని చూసి తండ్రి భోరున విలపించాడు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదంటూ విజయనగరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు లోకేష్ స్నేహితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సెల్‌ఫోన్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి 1.30 నుంచి 3 గంటల మధ్య మృతి జరిగినట్టుగా ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. పంచనామా నిర్వహించిన వైద్యులు సైతం సస్పైడ్ డెత్ అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. ఇటీవల తన తరగతికే చెందిన ఓ విద్యార్థినిని లోకేష్ ఇష్టపడినట్టుగా సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఇదే సమయంలో మరో యువకుడు కూడా అదే అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు స్నేహితుల ద్వారా తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో లోకేష్ మృతి మిస్టరీగా మారింది. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని యువకుడు పరారీ!

విజయనగరం క్రైమ్: విజయనగరం పట్టణంలోని రెయ్యిల వీధికి చెందిన పాండ్రంకి సాయి (29) కనిపించడం లేదంటూ తల్లి చిట్టెమ్మ విజయనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. సాయికి వచ్చేనెల పెళ్లి చేయాలని పెద్దలు ముహూర్తం పెట్టారు. ఇష్టంలేని పెళ్లి చేయడం వల్లే ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

12 నెలల్లో 56 మిస్సింగ్ కేసులు
జిల్లా కేంద్రంలో మిస్సింగ్ కేసుల నమోదు ఇటీవల పెరిగింది. గడిచిన 12 నెలల్లో వన్టౌన్ పోలీస్ స్టేషన్‌లో 56 మిస్సింగ్ కేసులు నమోదు కావడం గమనార్హం. 22 మంది మహిళలు మిస్సింగ్ కాగా, 21 మందిని పోలీసులు పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మాటలురాని (మూగది) కే.ఎల్.పురానికి చెందిన బి.ముత్యాలమ్మ(59) ఆచూకీ పోలీసులకు ఇప్పటికీ లభించలేదు. పురుషుల్లో 20 మంది అదృశ్యంకాగా 17 మందిని సురక్షితంగా ఇంటికి చేర్చారు. కె.ఎల్.పురానికి చెందిన జి.కూర్మారావు(52), నాగోజీ పేటకు చెందిన గంటా నారాయణరావు(37), వీటీ అగ్రహారం రీమా పేటకు చెందిన గడి అప్పారావు(55) ఆచూకీ తెలియాల్సి ఉంది. వీరి ఆచూకీని తెలుసుకునేందుకు పోలీస్‌బృందాలు పనిచేస్తున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.



సంగమేశ్వరుని దర్శనానికి బారులు తీరిన భక్తులు



మర్రిచెట్టు నీడన భక్తుల వంటావార్పు

సంగాంలో భక్తజన సందోహం

వంగర మండలం సంగాంలో వెలసిన సంగమేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శివరాత్రి పర్వదినాన జాగరణ చేసిన భక్తులందరూ సువర్ణముఖి, వేగావతి, నాగావళి నదులు కలిసే త్రివేణి సంగమంలో గురువారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారికి పూజలు చేశారు. 400 ఏళ్లనాటి భారీ మర్రి వృక్షం నీడన వంటావార్పు చేసి పితృదేవతలకు పిండప్రదానం జరిపారు. – వంగర



త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఎమ్మెల్సీ ఓటింగ్‌కు... 311 మంది టీచర్లు డుమ్మా!

- ప్రశాంతంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు
- విజయనగరం జిల్లాలో అనూహ్యంగా 94.05 శాతం పోలింగ్
- మెరకముడిదాం, గుర్ల, పూసపాటిరేగ, భోగాపురం కేంద్రాల్లో శతశాతం ఓటింగ్
- విజయనగరంలోని మూడో పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 87.21 శాతం పోలింగ్
- పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ ఎమ్మెల్యేల హల్‌చల్



విజయనగరం సంగీత నృత్య కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఉపాధ్యాయులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: జిల్లాలోని 29 పోలింగ్ కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 5,223 మంది ఓటర్లకు గాను 4,912 మంది (94.05 శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 311 మంది డుమ్మాకొట్టారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. అత్యధిక పోలింగ్ శాతం నమోదుకావడం అధికార పార్టీకి గట్టి దెబ్బతగిలే అవకాశం కనిపిస్తోంది. టీడీపీ, జనసేన పార్టీలు ప్రత్యక్షంగా మద్దతు ప్రకటించిన ఏపీటీఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ విజయావకాశాలపై ప్రభావం ఉంటుందని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో అనేక హామీలు గుప్పించిన టీడీపీ, జనసేన నాయకులు తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత టీచర్ల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చూపడం ఈ ఎన్నికల్లో ప్రధాన అంశమైంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వ్యతిరేక ఓటు ద్వారా తమ నిరసన తెలిపే అవకాశం ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాన్ని ముందే ఊహించిన టీడీపీ అధిష్టానం నియోజకవర్గం వారీగా ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించింది. గత రెండ్రోజులుగా తాయిలాల పంపిణీ యథేచ్ఛగా సాగింది. కొన్నిచోట్ల డబ్బు కూడా ఎరవేశారని ప్రత్యర్థి అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. రెండో ప్రాధాన్య ఓటు వేయాలని బెదిరింపులకు దిగినట్లు తెలిసింది. అధికార పార్టీ నాయకుల దూకుడు నచ్చని టీచర్లు కూటమి బలపర్చిన రఘువర్మకు గాకుండా ఆయన సమీప ప్రత్యర్థులైన పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు, పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిలకు ఓటు వేశారనే ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా ప్రధాన పోటీ శ్రీనివాసులనాయుడు, విజయగౌరి మధ్యే ఉంటుందని విశ్లేషిస్తున్నారు.



అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు



మహారాజా సంగీత, నృత్య కళాశాలలో పోలింగ్ తీరును పర్యవేక్షిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

3న ఓట్ల లెక్కింపు...

పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను భద్రంగా విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌కు పోలింగ్ సిబ్బంది చేర్చుతున్నారు. అక్కడే మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది.

పోలింగ్ ప్రక్రియ పరిశీలన
పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందల్ పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంలోని మహారాజా సంగీత, నృత్య కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అక్కడ ఏర్పాట్లపై విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి, తహసీల్దార్ కూర్మనాథరావును ఆరా తీశారు. తర్వాత భోగాపురంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా 29 కేంద్రాల్లో పోలింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయనగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయన్నారు.

నెమ్మది నెమ్మదిగా మొదలై...
జిల్లాలోని 29 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటలకు 19.34 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలకు 56.29 శాతానికి చేరింది. మధ్యాహ్నం 2 గంటలకు 78.42 శాతం, సాయంత్రం 4 గంటలకు 94.05 శాతం పోలింగ్ నమోదైంది. నెమ్మదిగా మొదలైన పోలింగ్ అనూహ్యంగా రికార్డు స్థాయికి చేరింది. విజయనగరం డివిజన్‌లో 3,038 ఓట్లు (93.22 శాతం), బొబ్బిలి డివిజన్‌లో 1011 ఓట్లు (95.02 శాతం), చీపురుపల్లి డివిజన్‌లో 863 ఓట్లు (95.89 శాతం) పోల్ అయ్యాయి. జిల్లాలో మొత్తం 3,270 మంది పురుష ఓటర్లలో 3,084 మంది, 1953 మంది మహిళా ఓటర్లలో 1828 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ స్టేషన్	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
వంగర	61	57	93.44
రేగిడి	96	94	97.92
సంతకవిటి	115	111	96.52
రాజాం	322	310	96.27
బొబ్బిలి	579	543	93.78
ఆర్.బి.పురం	81	77	95.06
బాడంగి	61	60	98.36
తెర్లాం	82	77	93.90
మెరకముడిదాం	55	55	100.00
దత్తిరాజేరు	60	58	96.67
మెంటాడ	56	55	98.21
గజపతినగరం	145	141	97.24
బొండపల్లి	77	76	98.70
గుర్ల	38	38	100.00
గరివిడి	84	77	91.67
చీపురుపల్లి	129	121	93.80
నెల్లిమర్ల	183	177	96.72
పూసపాటిరేగ	30	30	100.00
భోగాపురం	35	35	100.00
డెంకాడ	75	72	96.00
విజయనగరం-1	882	802	90.93
విజయనగరం-2	1026	947	92.30
విజయనగరం-3	258	225	87.21
గంట్యాడ	150	149	99.33
ఎస్. కోట	189	184	97.35
వేపాడ	48	47	97.92
ఎల్. కోట	63	61	96.83
జామి	111	107	96.40
కొత్తవలస	132	126	95.45
మొత్తం	5,223	4,912	94.05



పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

టీడీపీ నాయకుల హల్‌చల్...

ప్రతి పోలింగ్ కేంద్రానికి సమీపంలో అధికార పార్టీ నాయకులు సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మకు మద్దతుగా ప్రత్యేకంగా శిబిరాలు తెరిచారు. టీడీపీ ఎమ్మెల్యేలు ఆ టెంట్‌ల్లో కూర్చొని టీచర్లను ప్రభావితం చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. గతంలో లేని సంప్రదాయానికి టీడీపీ నాయకులు తెరతీయడంపై ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ విజయనగరం ఎమ్మెల్యే అదితి, కార్యకర్తలు

ఎల్.కోటలో బర్డ్‌ఫ్లూ!



లక్కవరపుకోట మండలంలో బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తిచెందిందన్న వార్త ప్రస్తుతం కలకలం రేపుతోంది. మండలంలోని అరకు-విశాఖపట్నం రోడ్డులో జమ్మాదేవిపేట ఎత్తు బ్రిడ్జి సమీపంలోని రైస్ మిల్లులో పెంచుతున్న రెండు టర్కీ కోళ్లు గురువారం మృతి చెందాయి. బుధవారం రాత్రి వరకు బాగానే ఉన్న కోళ్లు ఉదయానికి మృతి చెందినట్లు మిల్లు యజమాని తెలిపారు. మృతి చెందిన కోళ్లను రోడ్డు పక్కనే పడేయడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ బర్డ్‌ఫ్లూతో చనిపోతే గొయ్యితీసి పూడ్చాలే తప్ప ఇలా పడేయడం వల్ల వైరస్ వ్యాప్తిచెందే అవకాశం ఉందంటున్నారు. ఇదే విషయంపై ఎల్.కోట మండలం పశుసంవర్ధక శాఖ అధికారి కోరాడ గాయత్రి మాట్లాడుతూ ఇంతవరకు బర్డ్‌ఫ్లూ వైరస్ ఎక్కడా నమోదుకాలేదన్నారు. వాతావరణ మార్పులతో ప్రస్తుతం కోళ్లు చనిపోతున్నాయన్నారు. చనిపోయిన కోళ్ల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. – లక్కవరపుకోట

వచ్చేనెల 6న ఆశవర్కర్ల చలో విజయవాడ

విజయనగరం గంటస్తంభం: తమ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చేనెల 6 తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టామని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఎల్.శాంతమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం, సెలవులు, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, పనిభారం తగ్గించాలని, తదితర డిమాండ్ల పరిష్కారానికి ఆందోళన తలపెట్టామన్నారు. ఏళ్ల తరబడి అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా తమ బతుకులు మారడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని ప్రకటించారు. డిమాండ్లు పరిష్కరించాలంటూ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.సుధారాణితో కలిసి డీఎంహెచ్ఓ జీవనరాణికి వినతి ప్రతం అందజేశామన్నారు.

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

- డీఈఓ తిరుపతినాయుడు

పార్వతీపురంటౌన్: విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుపతి నాయుడు అన్నారు. సైన్స్ దినోత్సవ పోస్టర్‌ను డీఈఓ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌పట్ల ఆసక్తి పెంచేలా జిల్లాలో శుక్రవారం వివిధ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. 3, 4, 5 తరగతుల విద్యర్థులకు ఇస్రో సాధించిన విజయాలపై డ్రాయింగ్ పోటీలు, 8, 9 తరగతుల విద్యార్థులకు వికసిత్ భారత్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపైన సెమినార్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం పాఠశాల స్థాయి, మార్చి 1న మండల స్థాయి, మార్చి 3న జిల్లా స్థాయి పోటీలు ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు, ఆప్‌కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ, ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ జి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోనే ధాన్యం



వరి పండించే రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. చేతికొచ్చిన పంటను కొనుగోలుచేసేవారే కరువయ్యారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలుకు అనుమతులు మంజూరు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించినా స్పందన లేదు. నూర్పిడి చేసిన ధాన్యం పొలాల్లోనే ఉండిపోయాయి. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతన్నను నిలువునా ముంచేసిందంటూ ఆవేదన చెందుతున్నారు. – సంతకవిటి

కొత్త ఆవిష్కరణలపైనే భవిత

- ఏపీ మాజీ ఐటీ సలహాదారు జేఏ చౌదరి
- సరికొత్త సాంకేతిక యుగానికి యువత నాందిపలకాలి
- జీఎంఆర్ ఐటీలో స్టెప్‌కాన్ సదస్సు ప్రారంభం

రాజాం సిటీ: ప్రస్తుత కాలంలో టెక్నాలజీ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని, కొత్తకొత్త ఆవిష్కరణలపైనే యువత భవిత ఆధారపడి ఉందని ఏపీ మాజీ ఐటీ సలహాదారు, ఇండియన్ బ్లాక్‌చైన్ స్టాండర్డ్స్ కమిటీ చైర్మన్ జేఏ చౌదరి అన్నారు. రాజాం జీఎంఆర్ ఐటీలో స్టెప్‌కాన్-2025 సదస్సు గురువారం ప్రారంభమైంది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చౌదరి మాట్లాడుతూ భవిష్యత్తులో స్థిరమైన ప్రభుత్వ ఉద్యోగాలు ఉండవన్నారు. పరిశ్రమల మనుగ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఈ తరుణంలో యువతరం నూతన ఆవిష్కరణలతో ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి సరికొత్త సాంకేతిక యుగానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చిన్నవయసు నుంచే తమ ఆలోచనలను ఆవిష్కరణలుగా మార్చాలన్నారు. అలాంటి వారిని ప్రోత్సహించేందుకు స్టార్టప్ కంపెనీలు, యూనికార్న్‌లు ముందుకు వస్తున్నాయని తెలిపారు. 8 నుంచి 18 ఏళ్ల ప్రతిభావంతులైన గ్రామీణ యువకుల కోసం జూనికార్న్ ఏర్పాటైందని, 19 నుంచి 25 ఏళ్ల యువకులు అనేక రోజువారీ సమస్యలకు పరిష్కారాలు వెతికేందుకు సిద్ధమవుతున్నారన్నారు. 5 నుంచి 6 నెలల పాటు 30 మంది చేసే ప్రాజెక్టును ఐదు నిమిషాల్లో పూర్తిచేసే ఏఐ సాధనాలు మనకు లభ్యమవుతున్నాయని తెలిపారు. దీనిని మరింతగా అభివృద్ధి చేసేందుకు క్వాంటం కంప్యూటింగ్ తోడైతే రాబోయే రోజుల్లో మరింత డిప్రెషన్స్‌కు దారితీస్తాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో సమగ్రమైన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని సంపాదించుకుంటే మనుగడ ఉంటుందని, ఉద్యోగ అవకాశాలు పొందగలరని తెలిపారు. ఏకాగ్రత, దూరదృష్టితో ఏదైనా సాధించవచ్చన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ తరగతిలో కాకుండా బయట అనేక విషయాలు నేర్చుకోవచ్చని, కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి పనిచేయాలన్నారు. కోర్, ఐటీలను మేళవించి నిత్యజీవితంలో అనేక సమస్యలకు పరిష్కారాలను పొందగలమని తెలిపారు. సదస్సుకు దేశం నలుమూలల నుంచి 3,884 మంది విద్యార్థులు హాజరయ్యారు.



తమ ఆవిష్కరణలను వివరిస్తున్న విద్యార్థులు



సదస్సును ప్రారంభిస్తున్న ఏపీ మాజీ ఐటీ సలహాదారు జేఏ చౌదరి

వీరంతా ప్రాజెక్ట్స్, స్టార్టప్ ఐడియా కాంటెస్ట్, పేపర్ ప్రజెంటేషన్, వర్క్‌షాప్స్ తదితర అంశాల్లో ప్రతిభను ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, సీఈఓ ఎల్ఎం లక్ష్మణమూర్తి, స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జి.కౌశిక్, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ జె.శ్రీధర్, కో కన్వీనర్ డాక్టర్ ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల హైడ్రో హైక్ ప్రదర్శన

క్లుప్తంగా

పోలమాంబ ఐదో జాతర ఆదాయం రూ.5లక్షలు



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఐదో జాతర ఆదాయం ఈఓ వీవీ సూర్యనారాయణ సమక్షంలో గురువారం లెక్కించారు. శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,78,600లు, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.61,320లు, కేశ ఖండన టికెట్ల ద్వారా రూ.5,480లు, మహా అన్నదాన విరాళాల ద్వారా రూ.97,086, లడ్డు ప్రసాదం ద్వారా రూ.1,08,840 రూపాయలు, పులిహోర ప్రసాదం ద్వారా రూ.64,770 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఐదో జాతరలో మొత్తంగా 5,16,096 రూపాయలు ఆదాయం సమకూరింది. లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్ద లు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పరుగు పోటీలు



ఉల్లాసంగా పరుగు తీస్తున్న ఎడ్లు బండి

లక్కవరపుకోట: మండలంలోని లచ్చంపేట గ్రామంలో గురువారం నిర్వహించిన అంతర్ జిల్లాల ఎడ్ల పరుగు పందెం పోటీలు ఉత్సాహంగా సాగాయి. గ్రామంలో గల శ్రీ వీరమాంబ సహిత గిరినాగేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రిని పురస్కరించుకొని గ్రామస్తులు ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 8 జతల ఎడ్లు బళ్లు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతిలను అందజేశారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



ప్రయాణికుడు పోగొట్టుకున్న నగదును అందజేస్తున్న ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు భద్రత, భరోసా పెరుగుతుంది. అందుకు గురువారం జరిగిన సంఘటనే ఉదాహరణ. విశాఖపట్నం నుంచి విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కి ఆర్టీసీ బస్సులో వచ్చిన అప్పలసూర్యనారాయణ అనే ప్రయాణికుడు రూ.17,500 నగదును బస్సు సీట్లో వదిలేసి వెళ్లిపోయారు. సంబంధిత బస్సు కండక్టర్ పీఎస్ఎం రాజు దీన్ని గుర్తించి సీట్లోని నగదును తీసుకొని కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది సత్యంకు అందజేశారు. తిరిగి వచ్చిన ప్రయాణికుడికి ఆయన వదిలేసిన నగదును డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు సమక్షంలో అందజేశారు. కండక్టర్ నిజాయితీని ఆర్టీసీ అధికారులు అభినందించారు.

సురక్షితంగా గిరిజన చిన్నారులు : డీఎంహెచ్‌ఓ

విజయనగరం ఫోర్ట్: ఎస్.కోట మండలంలోని గిరిశిఖర గ్రామాలైన రాయపాలేం, గూనపాడు, శనగపాడు కురిడి గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న చిన్నారులకు ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నామని, అందరూ సురక్షితంగా ఉన్నారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చికిత్స అనంతరం కోలుకున్న ఇద్దరిని డిశ్చార్జ్ చేసినట్టు పేర్కొన్నారు. మిగిలిన పిల్లలకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందజేస్తున్నామని తెలిపారు. అస్వస్థతకు గురైన 4 గ్రామాల్లో ఇప్పటికే యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్పేస్ స్ప్రేను జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో చేయనున్నట్టు తెలిపారు.

● రడీమేడ్ వైపు ప్రజల దృష్టి ● వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'జగనన్న చేదోడు'తో భరోసా
● ఆదుకోని కూటమి ప్రభుత్వం ● నేడు ప్రపంచ టైలర్ల దినోత్సవం

దర్జా కోల్పోయిన దర్జీలు



కుట్టు పనిలో టైలర్

రాజాం సిటీ: సమాజంలో హుందాగా కనిపించాలంటే దుస్తులే ప్రధానం. పండగలు, శుభకార్యాలు, చిన్నచిన్న కార్యక్రమాలు ఏవైనా సరే టైలర్లకు చేతి నిండా పని ఉండేది. కొత్త దుస్తులు కుట్టించుకునేందుకు టైలర్ల వద్దకు క్యూ కట్టేవారు. గతంలో వీరి పరిస్థితి దర్జాగా ఉండేది. అటువంటిది కాలక్రమంలో మార్కెట్‌లోకి పలు ఫ్యాషన్లు, డిజైన్లతో కూడిన రడీమేడ్ వస్త్రాలు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం టైలర్లకు ఉపాధి కరువైంది. గతంలో దర్జాగా బతికే వారి జీవితాల్లో దర్జా లేకుండా పోవడమే కాకుండా కులవృత్తినే నమ్ముకున్న వారి పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతోంది. నేడు ప్రపంచ టైలర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఫ్యాషన్ వైపు పరుగులు

టైలర్ వృత్తి రోజురోజుకీ అనేక మార్పులకు గురౌతు వచ్చింది. ఇప్పుడు ఫ్యాషన్ టెక్నాలజీలో భాగంగా మారిపోవడంతో పాత కుట్టుమిషన్ల స్థానంలో అత్యాధునిక మిషన్లు వచ్చాయి. కంప్యూటర్లు ప్రవేశంతో ఎలాంటి డిజైన్ అయినా అలవోకగా తీర్చిదిద్దే విజ్ఞానం అందుబాటులోకి వచ్చేసింది. నేటి యువతతో పాటు మధ్య వయసు వారు సైతం ఎక్కువగా టీ షర్టులు, జీన్స్ ప్యాంట్లు ధరిస్తున్నారు. షాపింగ్ మాల్స్‌లో అయితే ఆఫర్ల పేరుతో వల వేస్తుండడంతో ప్యాంట్లు, షర్టులు సైతం రడీమేడ్ కొనుగోలు చేస్తున్నారు. అతి కొద్ది మంది మాత్రమే టైలర్ల వద్ద దుస్తులు కుట్టించుకుంటున్నారు. దీంతో టైలర్లకు పెద్దగా పనిలేని పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు పండుగల సమయంలో ఇంటిల్లపాది కొత్త దుస్తులు కోసం క్లాత్‌లు తెచ్చుకుని టైలర్ల వద్ద కుట్టించుకునేవారు. దీంతో తినడానికి సమయం లేని స్థితి నుంచి నేడు దయనీయ స్థితికి టైలర్లు చేరుకున్నారు.

నాడు జగనన్న చేదోడుతో బాసట

కష్టాల్లో నలిగిపోతున్న టైలర్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంది. టైలర్ల కోసం 'జగనన్న చేదోడు' పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించింది. ప్రతి టైలర్‌కు ఏటా రూ.10వేలు ఆర్థిక సాయం అందించింది. టైలర్లకు ఈ పథకం కొంతమేర వెసులుబాటు కల్పించింది. ప్రతి విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం క్లాత్‌ను ప్రభుత్వం అందించి కుట్టు కూలి డబ్బులను తల్లుల ఖాతాలో జమ చేస్తూ వచ్చింది. యూనిఫాం ప్రభుత్వం కుట్టించి ఇవ్వకుండా క్లాత్ మాత్రమే ఇవ్వడంతో టైలర్లకు వారికి పని కల్పించడంతో పాటు మేలు జరిగింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం టైలర్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. కనీసం గతంలో మాదిరిగా విద్యార్థులకు క్లాత్ ఇస్తే కొంతవరకైనా తమకు ఉపాధి లభిస్తుందని టైలర్లు అభిప్రాయపడుతున్నారు.

వెలవెలబోతున్న టైలరింగ్ షాపులు

గ్రామ స్థాయి నుంచి పట్టణం వరకు ప్రతి చోటా టైలర్లు ఉన్నారు. షాపుల ద్వారా కొందరు... ఇళ్లల్లోనే మరికొందరు వస్త్రాలు కుడుతున్నారు. నియోజకవర్గంలో సుమారుగా 350 మంది వరకు దర్జీ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రెడీమేడ్ దుస్తులు తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చేస్తుండడంతో వస్త్రం తీసుకుని టైలర్ల వద్ద కుట్టించుకునేవారు తగ్గిపోయారు. దుస్తులు కుట్టించుకునేందుకు ఎవరు వస్తారా.. అని టైలర్లు ఎదురు చూసే పరిస్థితులు వచ్చాయి. ఇదిలా ఉంటే కుటుంబ పోషణతో పాటు షాపుల అద్దెలు చెల్లించేంత సంపాదన లేక దీన స్థితిలో బతుకీడుస్తున్నారు.

పనులు లేకుండా పోయాయి



రడీమేడ్ వస్త్రాల రాకతో మాకు పనులు లేకుండా పోయాయి. పండుగల సమయంలో కూడా పనులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఇంతకు ముందు పండుగల సమయంలో రాత్రి పగలు పనిచేసే వాళ్లం. భవిష్యత్తులో ఈ వృత్తిలో కొనసాగడం కష్టతరంగా మారుతుంది. ఈ వృత్తిని కొనసాగించేందుకు కూడా యువత ఆసక్తి చూపడం లేదు.

– కె.సత్యం, టైలర్, వస్త్రపురి కాలనీ, రాజాం

టైలరింగ్‌పైనే ఆధారం



టైలరింగ్ పనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. పనులు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చాలా మంది రడీమేడ్ దుస్తులు వాడడంతో కుట్టించుకునేవారి సంఖ్య తగ్గిపోతుంది. ఇతర వృత్తి చేసుకోలేక ఈ వృత్తితో నెట్టుకొస్తున్నాం. రోజు కూలి గిట్టుబాటు అయితే చాలు అన్న చందంగా టైలర్ల పరిస్థితి ఉంది. ప్రభుత్వం మాలాంటి టైలర్లను ఆదుకోవాలి. ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రుణాలు మంజూరుచేసి అవసరమైన పని కల్పించాలి.

– ఎ.రాజేష్, టైలర్, మారుతీనగర్, రాజాం

బియ్యం అక్రమ రవాణాపై నిరంతర నిఘా

● జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మధుసూదన్



బియ్యం అక్రమ రవాణాపై ఎస్‌ఐకు సూచనలిస్తున్న జిల్లా సివిల్ సప్‌లైస్ అధికారి మధుసూదన్

రామభద్రపురం: పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మధుసూదన్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ సులోచనరాణితో కలిసి గురువారం ఆయన ఎస్‌ఐ వి.ప్రసాదరావుతో సమావేశమయ్యారు. మండల కేంద్రం గుండా పీడీఎస్ బియ్యం లారీలతో అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందని, అలా జరగకుండా కొట్టక్కి చెక్ పోస్టుతో పాటు స్థానిక బైపాస్ రోడ్డులో నిఘా పెట్టాలని ఎస్‌ఐకు సూచించారు. పెద్ద లారీలతో పాటు వ్యాన్‌లతో రవాణా జరుగుతున్న బియ్యాన్ని పరిశీలించి విడిచిపెట్టాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని ఎస్.కోట, రామభద్రపురం తదితర ప్రాంతాల బోర్డర్‌లో ఉన్న ఒడిశా రాష్ట్రానికి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ఇంకా మరో 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు అనుమతి కోరామన్నారు. ఏడాదిగా కొత్త రేషన్ కార్డులు మంజూరు లేదన్నారు. ప్రతీ ఒక్క కార్డుదారుడు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. శాశ్వత వలసదారులు, మృతి చెందిన వారి కార్డుల ఏరివేతలో భాగంగా ప్రభుత్వం ఈకేవైసీ చేయిస్తుందన్నారు. గత నెలలో 5,81,668 కార్డులు ఉండగా ఈ నెలలో 5,71,774 కార్డులు ఉన్నాయన్నారు. సుమారు 10 వేల కార్డులు వరకు రద్దయ్యాయని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలకు సన్న రకం బియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతుందన్నారు. వారి వెంట సీఎస్‌డీటీ సాయికృష్ణ ఉన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్‌చక్రవర్తి

విజయనగరం లీగల్: మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ చేసేలా కృషి చేయాలని విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని న్యాయమూర్తులతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటారు ప్రమాద బీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు తదితరమైనవి ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, బి.అప్పలస్వామి, టీవీ రాజేష్ కుమార్, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి, విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ దేవీ రత్నకుమారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రమ్య, ఎక్సైజ్ న్యాయమూర్తి ఎస్.శ్రీనివాస్, మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి పాల్గొన్నారు.

అండర్ 14 ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-14 బాల, బాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పూర్తయింది. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని విజ్జి స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపికలకు ఉమ్మడి విజయనగరం జిల్లాల నుంచి 25 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో ఎస్.జితేంద్ర, కె.జస్వంత్, కె.జితేంద్ర, డి.ధీరజ్, సి.శ్యామ్‌కుమార్, హిమశ్రీ, బి.హసిని శ్రీవల్లి ఉన్నారు. క్రీడాకారులు మార్చి 1, 2 తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లాలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డివి.చారిప్రసాద్ తెలిపారు. ఎంపిక పోటీలను పలువురు న్యాయ నిర్ణేతలు పర్యవేక్షించారు.


గిరిజన యూనివర్సిటీలో జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సులో పాల్గొన్న వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో బోటనీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'కల్టివేషన్ ది ఫ్యూచర్ : అడ్వాన్సెస్ ఇన్ ప్లాంట్ సైన్స్ అండ్ బయోటెక్నాలజీ ఫర్ సస్టెయినబిలిటీ 2025' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సు గురువారం ప్రారంభం అయింది. తొలిరోజున 'ప్లాంట్ బయోటెక్నాలజీతో సుస్థిరత' అనే అంశంపై హైదరాబాద్ ఇక్రిశాట్ మాజీ డీడీజీ రీసెర్చ్ డైరెక్టర్ ప్రసాద్, సీడ్స్ ప్రతినిధి డాక్టర్ అరివ్యంద్‌కుమార్ వివరాలు ప్రెజెంటేషన్ చేశారు. లక్నో బీబీఏ యూనివర్సిటీ బయాలజీ ఆఫ్ ప్లాంట్స్ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రొఫెసర్ రాణా ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్లాంట్ అండ్ యానిమల్ జీనోమ్ స్టడీస్ ఆవశ్యకతపై విద్యార్థి దశ నుంచి అవగాహన పెంచుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు మాట్లాడుతూ వృక్షశాస్త్రం, జంతుశాస్త్రాలలో రాబోయే మార్పులను గమనిస్తూ పరిశోధనలు ఉండాలని సూచించారు. ఆయా పరిశోధనల ఫలితాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. డాక్టర్ అనిరుధ్‌కుమార్ సెమినార్ కన్వీనర్‌గా వ్యవహరించగా రిజిస్ట్రార్ తంత్రవాహి శ్రీనివాసన్, డీన్ ముక్కామల శరత్చంద్రబాబు, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు వివిధ అంశాలపై తమ పరిశోధనలను పంచుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రదానం



మృతుడు కొల్లి రమణ

మక్కువ : మండల కేంద్రంలోని యాదవ వీధికి చెందిన కొల్లి రమణ(61) ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతూ గురువారం విశాఖలోని కేజీహెచ్‌లో మృతి చెందాడు. ఈ విషయం కేజీహెచ్ వైద్య సిబ్బంది విశాఖపట్నంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు కేజీహెచ్‌కు చేరుకొని కుటుంబ సభ్యులకు నేత్ర దానంప అవగాహన కల్పించారు. దీంతో రమణ కుటుంబ సభ్యులు నేత్ర దానానికి అంగీకారం తెలిపారు. దీంతో కళ్లను దానం చేశారు. మృతుడు రమణకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

నేటి నుంచి బిజినెస్ ఐడియా అవగాహన సదస్సు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 'జనరేట్ యువర్ బిజినెస్ ఐడియా (జీవైబీ)' పేరుతో ఐదు రోజుల పాటు అవగాహన సదస్సును శుక్రవారం గంటస్తంభం ప్రాంతంలోని మెప్మా కార్యాలయంలో ప్రారంభిస్తామని ఆ సంస్థ జిల్లా మేనేజర్ జి.ప్రశాంత్‌కుమార్ గురువారం తెలిపారు. వచ్చే నెల మార్చి 5వ తేదీ వరకు నిర్వహించే సదస్సులో ఒక వ్యాపారాన్ని ఎలా ఎంచుకోవాలి, ఎలా ప్రారంభించాలి, ఎలా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న ఔత్సాహికులు 94929 27844 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్‌ఎం



రైల్వేస్టేషన్ ఆవరణలో అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

విజయనగరం టౌన్: విజయనగరం రైల్వేస్టేషన్‌ను ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ మేనేజర్ లలిత్ బోహ్రా గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ అధికారులతో కలిసి రైల్వేస్టేషన్ పరిసరాలు, పరిశుభ్రతపై చర్చించారు. ప్రయాణికులతో మాట్లాడి వారి సౌకర్యాలకు, భద్రతకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు ఆదేశించారు. ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌తో పాటూ బుకింగ్ ఆఫీస్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, క్యాటరింగ్ స్టాల్స్ తదితర వాటితో పాటూ అమృత్‌భారత్ స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.సందీప్ , రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹95	₹160	170

మామిడి తోటలో మృతదేహం



అప్పన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

గజపతినగరం రూరల్: మండలంలోని గుడివాడ గ్రామ మామిడి తోటలో గురువారం చుక్క అప్పన్న(65) అనే వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ లక్ష్మణరావు మృతదేహాన్ని పరిశీలించారు. మధుపాడ గ్రామానికి చెందిన చుక్క అప్పన్న వారం రోజులు క్రితం ఇంటి నుంచి కనిపించకుండా పోయినట్లు మృతుని భార్య సత్తెమ్మ పిర్యాదు చేసింది. అయితే మృతుడికి మతిస్థిమితం లేకపోవడం వల్ల తోటలో ఉండిపోవడంతో ఎవ్వరు గుర్తించలేకపోయారన్నారు. స్థానికుల సమాచారం మేరకు గుడివాడ గ్రామంలోని మామిడి తోటలో మృతదేహాన్ని పరిశీలించి బంధువులకు సమాచారం ఇచ్చామని ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



పట్టుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ సిబ్బంది

గజపతినగరం రూరల్: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎం కొత్తవలస గ్రామంలో పది మద్యం సీసాలను తరలిస్తున్న బొత్స చిట్టిదాసును పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు సీఐ జనార్ధనరావు గురువారం తెలిపారు. అక్రమంగా మద్యం తరలించినా, సారా తయారు చేసినా చర్యలు తప్పవన్నారు. దాడుల్లో సిబ్బంది నరేంద్రకుమార్, భాషా, లోకాభిరామ్, పాతిమాభేగం, సౌజన్య తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

చేపలు పట్టేశారని పోలీసులకు ఫిర్యాదు



కొర్లాం చెరువులో చేపలు పట్టిన గొల్లుపాలేంకు చెందిన వ్యక్తులు

గంట్యాడ: చేపలు దొంగతనంగా పట్టేశారని పోలీసులకు మత్స్యకారులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొర్లాం గ్రామ చప్పవాని చెరువులో బొండపల్లి మండలం గొల్లుపాలేంకు చెందిన ఏడుగురు వ్యక్తులు బుధవారం చేపలు పడుతుండగా కొర్లాం గ్రామానికి చెందిన మత్స్యకారులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గ్రామానికి చెందిన మత్స్యకారులు సింగిడి కృష్ణ, సింగిడి అప్పలరాము, సింగిడి శ్రీను, సర్పంచ్ చప్ప అబ్బయ్య, గ్రామ పెద్ద చప్ప చిన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువులో రూ.7 లక్షల వరకు మత్స్య సంపద ఉండేదని మత్స్యకారులు తెలిపారు. ప్రస్తుతం చెరువులో వల వేస్తే చేపలు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో అపర్ణబాబా ప్రతిభ

బొబ్బిలి: పట్టణానికి చెందిన కె.అపర్ణబాబా రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. విజయవాడలో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు జరిగిన డబుల్స్ ఫైనల్ పోటీల్లో విశాఖపట్నం క్రీడాకారుడు మురళీవర్ధన్‌తో కలిసి విజేతగా నిలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించారు. వారిద్దరూ మార్చి 16 నుంచి 21వ తేదీ వరకు గోవాలో జరిగే జాతీయ పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడనున్నారని షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంకమ చౌదరి తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు రేపు

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి వద్ద ఉన్న తాండ్రపాపారాయ పాలిటెక్నికల్ కళాశాలలో మార్చి ఒకటో తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ తూముల భాస్కరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఇసుజు కంపెనీ చేపడుతున్న ఈ ఇంటర్వ్యూలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ చదువుకున్న వారంతా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు.

మద్యం సీసాల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్సై గణేష్, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై పోలీసులు గురువారం దాడులు చేపట్టారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా మద్యం అమ్మకాల నియంత్రణపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. బెల్ట్‌షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు లోకల్ పోలీసులతో కలిసి దాడులు చేపట్టారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలో బెల్ట్‌షాపులో మద్యం విక్రయిస్తున్న నర్సింగరావును అదుపులోకి తీసుకుని, అతని నుంచి 83 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సైలు సతీష్, మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.